నిధుల కేటాయింపుపై వాగ్వాదం

- మండల సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించిన ఎంపీటీసీలు


నిధుల కేటాయింపుపై ప్రజాప్రతినిధుల వాగ్వాదం

కమాన్‌పూర్: రామగిరి మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం ఎంపీపీ ఆరెల్లి దేవక్క అధ్యక్షతన నిర్వహించారు. కాగా ఈ సమావేశాన్ని ఎంపీటీసీలు బహిష్కరించారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి సభ్యులందరూ ఏకగ్రీవ తీర్మానం చేసిన నిధుల కేటాయింపుపై ఎంపీటీసీలు, ఎంపీపీ, ఎంపీడీవోల మధ్య వాగ్వాదం నెలకొంది. ముందుగా వివిధ శాఖల అధికారులు మాట్లాడాలని కోరగా వ్యవసాయశాఖ అధికారి మాట్లాడుతుండగానే బేగంపేటలో రూ.2లక్షలతో పనులు చేపట్టినా నేటి వరకు చెక్కుపై సంతకం చేయకపోవడంతో బిల్లు రాక ఇబ్బంది పడుతున్నానని వాగ్వాదానికి దిగారు. ఎంపీటీసీలకు నిధులు కేటాయించడంలో నిర్లక్ష్యం ఎందుకంటూ వైస్ ఎంపీపీ కాపురబోయిన శ్రీదేవి, ఎంపీటీసీలు దర్ముల రాజసంపత్, ఉమ సమావేశాన్ని బహిష్కరించారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో గ్రామాల్లో అనేక సమస్యలు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులతో సమస్యలు చర్చించుకొని పరిష్కరించుకోవాలి తప్ప సమస్యలను పరిష్కరించని సమావేశాలు ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమ ప్రశ్నించారు. సమావేశంలో కమాన్‌పూర్ ఏఎంసీ చైర్మన్ దాసరి రాయలింగు, కమాన్‌పూర్ పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్ రావు, సర్పంచ్‌లు గంట పద్మ, ఎలువాక కుమార్, రామగిరి లావణ్య, ఎంపీడీవో ఇనుముల రమేశ్, తహసీల్దార్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

సుల్తానాబాద్‌రూరల్: మండలాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతోనే పనిచేస్తేనే సమగ్ర అభివృద్ధి సాధ్యం అవుతుందని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ బాలాజీరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధులు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఎక్కడైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా ప్రణాళిక రూపొందించుకొని చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతకు ముందు మండల అభివృద్ధికి సంబంధించి అధికారులు చదివి వినిపించగా సమస్యలపై ప్రజాప్రతినిధులు సభ అధ్యక్షుడి ముందుకు తీసుకువెళ్లారు. సమావేశంలో తహసీల్దార్ యాకయ్య, ఎంపీడీవో శశికళ, జెడ్పీటీసీ స్వరూప, ఏఎంసీ చైర్మన్ బుర్ర మౌనిక, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఆయా శాఖకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

మంథని: డివిజన్‌లోని మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్ మండలాలకు చెందిన 101 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు రూ.కోటి విలువ చేసే చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే డి.శ్రీధర్‌బాబు అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేశారు. అలాగే సుమారు రూ.15 లక్షల విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించారు.

'కేంద్రంలో, రాష్ట్రంలో అవినీతిపాలన'


ప్రజలతో మాట్లాడుతున్న దాసరి ఉష

పెద్దపల్లిరూరల్: కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాల పాలన పూర్తిగా అవినీతిమయమైందని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. పెద్దపల్లి పట్టణంలోని 5వవార్డులో శుక్రవారం మనవార్డు–మన ఉష కార్యక్రమంలో భాగంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పాలకులు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, అవినీతిపాలనపై ప్రజలకు వివరించారు. బడుగు, బలహీనవర్గాల ప్రజలందరి మేలు కోసం బీఎస్పీని ఆదరించాలని అభ్యర్థించారు. నాయకులు వెంకటేశ్, శేషాద్రి, ఎండీ రియాజ్, అరుణ, రామిండ్ల శారద, అజీం, కొమురయ్య, రవికుమార్, చంద్రశేఖర్, కిరణ్, రాహుల్, నరేశ్, రజనీకాంత్, రవితేజ పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత


చెక్కు అందిస్తున్న ఎంపీపీ కొండ శంకర్

మంథని: మంథని మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన రాపాక సౌజన్య భట్టుపల్లి సమీపంలో లారీ ప్రమాదంలో మరణించింది. కాగా ఆమెకు పోస్టాఫీసు ద్వారా వచ్చిన ప్రమాద బీమా రూ.10లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు అందించారు. స్థానిక పోస్టాఫీసులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శుక్రవారం పోస్టల్ సూపరింటెండెంట్ పసునూరి ప్రభాకర్, ఎంపీపీ కొండ శంకర్ చెక్కు అందించారు. సంవత్సరానికి రూ.399 బీమా తీసుకుంటే ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ కుటుంబానికి రూ.10లక్షలు అందిస్తున్నట్లు చెప్పారు.

వార్డులో స్వచ్ఛ శుక్రవారం


చెత్తాచెదారం తొలగిస్తున్న సిబ్బంది

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని 8వవార్డులో స్వచ్ఛత కార్యక్రమాలను శుక్రవారం కౌన్సిలర్ బొంకూరి భాగ్యలక్ష్మి పర్యవేక్షించారు. ప్రతి శుక్రవారం స్వచ్ఛ శుక్రవారంగా పాటిస్తూ కాలనీవాసులకు పరిశుభ్రతతో కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. డ్రైనేజీల్లో నీరు నిలవకుండా చర్యలు చేపట్టారు. ముళ్లపొదలు, పిచ్చిమొక్కలను తొలగించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్‌రెడ్డి, గద్దల శ్రీనివాస్, జయరాజ్, ఎల్లమ్మ, ప్రేమ్, వినోద్ పాల్గొన్నారు.

ఆలయంలో మండల పూజలు

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలో భక్త మార్కండేయ స్వామి ఆయలంలో శుక్రవారం మండల పూజ, నవగ్రహావాస్తు పూజ, రుద్ర హోమం, కుంకుమ పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. వేదపండితులు నిట్టూరి అంబరీష్ శర్మ, శ్రీనివాస్ శర్మ, శ్రవణ్ శర్మ, సువర్ణ రాజేందర్ శర్మ హోమం, పూజలు చేశారు. సర్పంచ్ ఆడెపు శ్రీదేవి రాజు, బీజేపీ నాయకులు ఏగోళపు సదయ్యగౌడ్, పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు సబ్బని రాజమల్లు, గ్రామశాఖ అధ్యక్షుడు గోలి సుధాకర్, నాయకులు పాల్గొన్నారు.

రైతుబీమా కోసం దరఖాస్తుల స్వీకరణ

సుల్తానాబాద్: నూతనంగా పట్టా పాస్‌బుక్ పొందిన రైతులు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి కదారి ప్రశాంత్ సూచించారు. సుల్తానాబాద్‌లో దరఖాస్తులు స్వీకరించారు. ఆగస్టు 5 వరకు కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

ఎల్‌వోసీ చెక్కులు అందజేత


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పలువురికి ఎల్‌వోసీ చెక్కులు అందజేశారు. దుగ్గిరాల రాజేశ్‌కు రూ.2.50లక్షలు, కొలిపాల లక్ష్మికి రూ.2.50లక్షలు, జహేద తబుస్సుం రూ.2.50లక్షలు, శాంతపురి శివానికి రూ.2.50లక్షలు, గద్దల నర్సయ్యకు రూ.2.50లక్షలు, ఆడెపు వెంకటేశ్‌కు రూ.1.50లక్షలు, కంది శ్రావన్‌కుమార్‌కు రూ.లక్ష విలువ గల ఎల్‌వోసీ చెక్కులను ఆయన అందజేశారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

పలు పార్టీలు, సంఘాలకు చెందిన నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వనపాకల విజయ్, వంగల బలరాంరెడ్డి, అరిగెల శ్రావణ్, వంశీ, గుండా వెంకటేశ్, కిషోర్, శ్రావణ్, భరత్, ప్రణీత్, కుమార్, రామ్ రెడ్డితో పాటు పలువురు పార్టీలో చేరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇంజపురి పులేందర్, రాంరెడ్డి, దొంత శ్రీనివాస్, కొమ్ము వేణుగోపాల్, కుమ్మరి శ్రీనివాస్, కల్వచర్ల కృష్ణవేణి, సాగంటి శంకర్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం వెంకట్రావుపల్లి కేకేనగర్‌లో శుక్రవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 20మందికి కంటి ఆపరేషన్లు నిర్వహించాల్సి ఉన్నట్లు గుర్తించామని క్లబ్ నిర్వాహకులు తెలిపారు. కంటి ఆపరేషన్ల నిమిత్తం 20 మందిని క్లబ్ ఆధ్వర్యంలో ఎలాంటి ఖర్చులు లేకుండా రేకుర్తి కరీనంగర్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ సభ్యులకు మాజీ సర్పంచ్ ముత్యాల గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. క్లబ్ డాక్టర్ శరణ్య, ప్రభాకర్, క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి పాల్గొన్నారు.

లేబర్‌కార్డు ఉన్నవారికి ఉచిత వైద్య పరీక్షలు

కమాన్‌పూర్: రామగిరి మండలంలోని రత్నాపూర్‌లో శుక్రవారం లేబర్ కార్డు ఉన్న వారికి కార్మిక వైద్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించినట్లు సర్పంచ్ పల్లె ప్రతిమ తెలిపారు. డాక్టర్ అఖిల, చక్రవర్తి, కార్తిక్, రాకేశ్, అనూష, ఆశ్రిత, కార్యదర్శి రమ్య పాల్గొన్నారు.

పట్టణాలకు దీటుగా పల్లెల అభివృద్ధి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. ఎంపీపీ స్రవంతి అధ్యక్షతన శుక్రవారం మండల సభ జరిగింది. పట్టణాలకు దీటుగా పల్లెలను అభివృద్ధి చేశామన్నారు. మండల పరిషత్‌లోని స్థలంలో మూడుగదుల నిర్మాణ పనులను ప్రారంభించారు. పంచాయతీ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వంతో మాట్లాడాలని యూనియన్ నాయకులు జ్యోతి, ఖాజా కోరారు. జెడ్పీటీసీ రామ్మూర్తి, ఎంపీడీవో రాజు, ఎంపీవో సుదర్శన్, విండో చైర్మన్ నర్సింహారెడ్డితో పాటు సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బుగ్గ రహదారిలో చెట్లకొమ్మల తొలగింపు


చెట్లకొమ్మలు తొలగిస్తున్న కానిస్టేబుళ్లు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని అటవీ ప్రాంతంలో ఉన్న శ్రీబుగ్గ రామేశ్వరాలయం రహదారిలో ఇటీవల కురిసిన ఈదురుగాలులు, భారీ వర్షాలకు విరిగిపడ్డ చెట్ల కొమ్మలను శుక్రవారం అంతర్గాం పోలీసులు తొలగించారు. ప్రస్తుతం ఆషాఢమాసం, శ్రావణమాసంలో ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. భక్తులు రాకపోకలకు ఇబ్బంది పడకుండా కుండా చర్యలు చేపట్టారు. అంతర్గాం ఎస్సై బోగె సంతోష్‌కుమార్, కానిస్టేబుల్స్ మోసం రవి, రవీందర్ ఉన్నారు.

ఆకట్టుకున్న బోనాల జాతర


బోనాలతో విద్యార్థులు

గోదావరిఖనిటౌన్: పట్టణంలోని రమేశ్‌నగర్‌లోని వాసవ్య విద్యాలయంలో శుక్రవారం విద్యార్థులు బోనాల జాతర నిర్వహించారు. సంప్రదాయ దుస్తులు ధరించి బోనాలతో పాఠశాల నుంచి రమేశ్‌నగర్ ప్రధాన కూడలి వరకు శోభాయాత్ర నిర్వహించారు.

కొనసాగుతున్న మధ్యాహ్న భోజనవర్కర్ల సమ్మె


సమ్మెలో మధ్యాహ్న భోజన వర్కర్లు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని అమరవీరుల స్తూపం వద్ద చేపట్టిన మధ్యాహ్నభోజన వర్కర్ల సమ్మె శుక్రవారం కొనసాగింది. అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని సంఘం నాయకుడు పూసాల రమేశ్ డిమాండ్ చేశారు.

విద్యార్థులకు షూ అందజేత



యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం చందనాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అదే పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న గణిత, సైన్స్ టీచర్లు ఉచితంగా షూ అందజేశారు. గణిత టీచర్ పద్మకుమారి, సైన్స్ టీచర్ ప్రశాంతి రాణి రూ.30వేల విలువగల బూట్లు కొనుగోలు చేసి హెచ్ఎం శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు.

బోనమెత్తిన చిన్నారులు



జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ నాలుగో డివిజన్‌లోని బచ్‌పన్ స్కూల్‌లో శుక్రవారం ఆషాడం బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీధర్, లావణ్య, ప్రిన్సిపాల్ అయేషా పాల్గొన్నారు.

కోనోకార్పస్ చెట్లను తొలగించండి

కోల్‌సిటీ: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ నాటిన కోనోకార్పస్ చెట్లను వెంటనే తొలగించాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం డిప్యూటీ కమిషనర్ నారాయణరావుకు వినతి పత్రం అందజేశారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సత్యనారాయణ, కార్పొరేషన్ అధ్యక్షుడు కోటగిరి పాపయ్య, ప్రధాన కార్యదర్శి రాజు, రాష్ట్ర మహిళా కార్యదర్శి స్వరాజ్యం, రవీందర్, రాజలింగం, అంకిరెడ్డి, లక్ష్మి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ఇంటింటికీ మొక్కల పంపిణీ

పాలకుర్తి: మండల కేంద్రంలో శుక్రవారం ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దుర్గం జగన్ గ్రామస్తులకు ఇంటికి 5చొప్పున పండ్లు, పూలమొక్కలను అందజేశారు. ఉపాధిహామీ సీనియర్ మేట్ సంతపూరి కనుకయ్య ఉన్నారు.

✦రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

సుల్తానాబాద్‌రూరల్: రైతుబీమా కోసం రైతులు దరఖాస్తులు చేసుకోవాలని ఏఈవో ప్రశాంత్ కోరారు. సుల్తానాబాద్ మండలం కనుకులలోని రైతువేదిక వద్ద శుక్రవారం రైతులకు బీమా పత్రాలు అందించారు. రైతులు పట్టాపాస్ బుక్, ఆధార్‌కార్డ్, నామినీ ఆధార్‌కార్డ్ జిరాక్స్‌తో ఏఈవోను సంప్రదించాలని సూచించారు.

✦చెరువు నిర్మాణానికి నిధులు మంజూరు

ధర్మారం: మండలంలోని కొత్తపల్లి గ్రామశివారులోని మ్యాదరి ఖండి వద్ద నూతనంగా చెరువు నిర్మాణానికి ప్రభుత్వం రూ.16కోట్ల 7 లక్షల నిధులు మంజూరు చేస్తూ శుక్రవారం జీవో విడుదల చేసింది. ఏడాది క్రితం రైతుల కోరిక మేరకు మ్యాదరి ఖండి నిర్మాణ ప్రాంతాన్ని మంత్రి కొప్పుల ఈశ్వర్ సందర్శించారు. అక్కడి పరిస్థితులను వివరిస్తూ సీఎం కేసీఆర్‌కు వివరించి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు ధర్మారం మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, వెల్గటూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏలేటి కృష్ణారెడ్డి తెలిపారు. ఈ చెరువు నిర్మాణంతో ధర్మారం మండలం కొత్తపల్లితో పాటు వెల్గటూర్ మండలం ఎండపల్లి, జగదేవ్‌పేట, కొండాపూర్, అంబారీపేట గ్రామాల్లోని 4వేల ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరు అందుతుందన్నారు.

✦16న టిఫిన్ బైటక్

సుల్తానాబాద్: జిల్లా కేంద్రంలోని నందన గార్డెన్‌లో 16న టిఫిన్ బైటక్ ఉంటుందని ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి చాతరాజ రమేశ్, బీజేపీ సుల్తానాబాద్ పట్టణ అధ్యక్షుడు ఎల్లంకి రాజన్న తెలిపారు.

✦గర్భిణులకు పౌష్టికాహారం కిట్లు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని శాంతినగర్ ప్రాంతంలో శుక్రవారం గర్భిణులకు పౌష్టికాహారం కిట్లను లయన్స్‌క్లబ్ పెద్దపల్లి ఎలైట్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. అధ్యక్షుడు భిక్షపతి, అతీఫ్‌తో పాటు రాఘవాపూర్ పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

✦చదువుకోసం సాయం..

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన అజయ్ ఉన్నత చదువుల కోసం శుక్రవారం రూ.15వేలు సాయంగా అందించారు. గాయత్రీ విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, క్లబ్ సభ్యులు బత్తుల రమేశ్, సతీశ్‌రెడ్డి, అశోక్‌కుమార్, శ్రావణ్, శ్రీనివాస్‌గౌడ్, భిక్షపతి, వెంకటేశ్, అతీఫ్ ఉన్నారు.

✦ఆర్‌ఎఫ్‌సీఎల్ బూడిద కట్ట నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ శాంతినగర్‌లోని ఆర్‌ఎఫ్‌సీఎల్ (రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్) బూడిద చెరువు కట్ట నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని శుక్రవారం కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్‌ఎఫ్‌సీఎల్ బూడిద చెరువు కట్ట బలహీనంగా ఉండడంతో వర్షాలు కురిసిన సమయంలో బూడిద చెరువులోని నీరు కట్ట ధ్వంసమై శాంతినగర్‌వైపు చేరడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో పలువురు కోర్టును ఆశ్రయించగా కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

✦నేడు మండల సర్వసభ్య సమావేశం

జూలపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో వేణుగోపాలరావు చెప్పారు. ఎంపీపీ కూసుకుట్ల రమాదేవి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.

సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాధ్యం


ప్రజలతో మాట్లాడుతున్న విజయరమణారావు

సుల్తానాబాద్‌రూరల్: పేదప్రజల సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మండలంలోని కొదురుపాక గ్రామంలో గడపగడపకూ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటా తిరిగి ప్రభుత్వ అవలంబిస్తున్న వైఖరిపై వివరించారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పేదలకు సొంతింటి కోసం రూ.5లక్షలు అందిస్తామని, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ, నిరుద్యోగ భృతి కింద రూ.4వేలు అందించడంతో పాటు అన్నివర్గాలపై వారికి సంక్షేమ పథకాలు అందిస్తామని పేర్కొన్నారు. నాయకులు ప్రకాశ్‌రావు, అంతటి అన్నయ్యగౌడ్, చిలుక సతీశ్, అబ్బయ్యగౌడ్, దయోదర్‌రావు, మహేందర్, పోచాలు, రాజగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉండాలి


మాట్లాడుతున్న యువకులు

పాలకుర్తి: రామగుండం నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయాలని మండల యువకులు కోరారు. బసంత్‌నగర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేరుగు నరేశ్, ఈసారపు శివకుమార్, పెద్దపల్లి పవన్, సంతపూరి లింగమూర్తి, తలారి తిరుపతి మాట్లాడారు. గోదావరిఖనిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేస్తే అంతర్గాం, పాలకుర్తి మండలాల ప్రజలకు ఇబ్బందిగా ఉంటుందని, రామగుండం బి-పవర్‌హౌజ్ వద్ద ఏర్పాటు చేస్తే గ్రామీణ ప్రాంత ప్రజలతో పాటు కార్పొరేషన్ పరిధిలోని ప్రజలందరికీ సౌకర్యంగా ఉంటుందన్నారు. ఇప్పటికే మండల కార్యాలయాలకు సొంత భవనాలు లేక ఊరికొక కార్యాలయం ఏర్పాటు చేయడంతో స్థానిక ప్రజలతో పాటు వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర అవస్థలు పడుతున్నారని, ఈ విషయంలో ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పునరాలోచించాలని కోరారు.

గిరిజన విద్యార్థులకు నిధులు విడుదల చేయాలి


వినతిపత్రం ఇస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

పెద్దపల్లిరూరల్: గిరిజన విద్యార్థులకు అందించే ఎంటీఎఫ్, ఆర్‌టీఎఫ్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సీపెల్లి రవీందర్, ప్రశాంత్, శ్రీనివాస్ కోరారు. కలెక్టరేట్‌లోని ఏవో శ్రీనివాస్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. గిరిజన విద్యార్థులకు అందించే నిధులు వెంటనే వారి ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె


ఓదెల: ఒంటికాలి మీద నిలబడి కార్మికుల నిరసన

రామగుండం: కార్మిక, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో చేస్తున్న సమ్మె శుక్రవారం కొనసాగింది. రిలే దీక్షలో భాగంగా శుక్రవారం దీక్షా శిబిరాన్ని బహుజన సమాజ్ పార్టీ ప్రతినిధులు సందర్శించి సంఘీభావం ప్రకటించారు. బీఎస్పీ నాయకులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి గోలివాడ ప్రసన్నకుమార్, నాయకులు చిలుక రామ్మూర్తి, మహ్మద్‌పాషా, బోరె శ్రీనివాస్, పుల్లూరి ప్రశాంత్, వికాస్ పాల్గొన్నారు.

జూలపల్లి: ఎంపీడీవో కార్యాలయం ఎదుట దీక్షా శిబిరంలో అన్ని గ్రామాల నుంచి వచ్చిన కార్మికులు పాల్గొని నిరసన తెలిపారు. బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతిబసు కార్మికులకు సంఘీభావం తెలిపారు. కార్మికులు సంపత్‌కుమార్, బాణయ్య, పురుషోత్తం, నాగయ్య, భాస్కర్, లచ్చయ్య ఉన్నారు.

సమ్మెకు కాంగ్రెస్, బీఎస్పీ సంఘీభావం

ధర్మారం: సమ్మెలో భాగంగా శుక్రవారం పంచాయతీ సిబ్బంది మండల పరిషత్ కార్యాలయం నుంచి జెడ్పీటీసీ పుస్కూరి పద్మజ ఇంటి వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందించారు. అనంతరం సర్పంచ్ జితేందర్‌రావుకు వినతిపత్రం అందించారు. పంచాయతీ సిబ్బందికి కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు గజ్జెల స్వామి, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి నక్క కుమార్ సంఘీభావం తెలిపారు. మాజీ ఎంపీటీసీ బొల్లి స్వామి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పాలకుర్తి రాజేశంగౌడ్, బీఎస్పీ నాయకులు గొడుగు ప్రశాంత్, అనిల్ పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్‌కు వినతిపత్రం అందించారు. యూనియన్ నాయకులు గట్టయ్య, రాజబాబు, లక్ష్మణ్, రామస్వామి, మురళి, సురేశ్, రాజేశ్వరి, లక్ష్మి, ఓదెమ్మ పాల్గొన్నారు.

ఎలిగేడు: జీపీ, ఉద్యోగ కార్మికులకు తాపీ మేస్త్రీల మండల సంఘం మద్దతు ప్రకటించింది. అనంతరం తమ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరుతూ జీపీ ఉద్యోగ కార్మికులు ఎంపీపీ తానిపర్తి స్రవంతి, జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ మండిగ రేణుకకు వినతిపత్రం అందించారు. జీపీ ఉద్యోగ, కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగురాల లచ్చయ్య, కార్యదర్శి ఎండీ.ఖాజ, కవ్వంపల్లి దేవయ్య, మండల అధ్యక్షుడు తీట్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఆసంపల్లి చంద్రయ్య, నాయకులు కొండయ్య, మొగిలి, నర్సయ్య, సత్యనారాయణ, కోండ్ర నర్సయ్య, చిరంజీవి పాల్గొన్నారు.

ఒంటికాలి మీద నిలబడి నిరసన

ఓదెల: ఓదెలలో శుక్రవారం ఒంటికాలిమీద నిలబడి కార్మికులు నిరసన తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోవడం లేదని వాపోయారు. నాగయ్య, బ్రహ్మచారి, కుమార్, మల్లేశ్, రమేశ్ లక్ష్మి పాల్గొన్నారు.

విశ్రాంతి ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

ఫెర్టిలైజర్‌సిటీ: ఎన్టీపీసీ ధన్వంతరి ఆసుపత్రి విశ్రాంతి ఉద్యోగులు శుక్రవారం రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ మాతంగికాలనీలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ధన్వంతరి ఆసుపత్రిలో సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన 15 ఏళ్ల అనంతరం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకోవడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు.

ప్లాస్టిక్‌ను బహిష్కరించాలి

జూలపల్లి: గ్రామాల్లో మహిళలు ప్లాస్టిక్‌ను బహిష్కరించాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం మహిళా నాయకురాలు శ్యామల అన్నారు. మండలంలోని తేలుకుంటలో శుక్రవారం కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొద్దుల లక్ష్మణ్ అందించిన బట్ట సంచులను మహిళలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వేముల బుచ్చమ్మ, రాజమ్మ, వేంసాని ప్రమీల, లక్ష్మి, మధురమ్మ తదితరులు ఉన్నారు.

చిన్నారుల్లో పౌష్టికాహారలోపం నివారించాలి


మాట్లాడుతున్న వైద్యాధికారి సంపత్

జూలపల్లి: చిన్నారుల్లో నులిపురుగుల నివారణ చర్యలు తీసుకుని పౌష్టికాహార లోపాన్ని నివారించాలని మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం వైస్ ఎంపీపీ మొగురం రమేశ్ అధ్యక్షతన జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు. 20 నుంచి 27 వరకు ఒకటి నుంచి 19 ఏళ్ల వయస్సు ఉన్న వారందరికీ నులిపురుగుల నివారణకు అల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీడీవో వేణుగోపాలరావు, ఎంపీవో కిరణ్, సీహెచ్‌వో కలీముద్దీన్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, సర్పంచ్ నర్సింహాయాదవ్ తదితరులు ఉన్నారు.